నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, మంగళవారం 22 అక్టోబర్ 2024 | KAMAREDDY




గోపాల్‌పేట్‌లో ధాన్యం కుప్పలోకి వర్షపునీరు రాకుండా మట్టికట్ట వేస్తున్న రైతు



లింగంపేట్ మండలం భవానీపేటలో ధాన్యం కుప్పల్లో నుంచి వర్షపు నీటిని తొలగిస్తున్న మహిళా రైతులు

# మిగిలింది కన్నీళ్లే..

## అకాల వర్షాలతో రైతు దిగాలు

- దంచి కొట్టిన వాన
- కొట్టుకుపోయిన వడ్లు
- నేలవాలిన వరి పైర్లు
- ఆందోళనలో అన్నదాతలు
- మొదలుకాని ధాన్యం సేకరణ
- రైతులకు నరకయాతన

అకాల వర్షాలతో రైతులు విలవిల్లాడుతున్నారు. కళ్ల ముందే వడ్లు వరదలో కొట్టుకుపోతుండడం చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయని ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ, కొట్టుకుపోయిన వడ్లను దోసిళ్లతో ఏరుకున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కనిపించిన దృశ్యాలివి.. నాగిరెడ్డిపేట, లింగంపేట్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, సిరికొండ, పొతంగల్ తదితర మండలాల్లో సోమవారం కురిసిన భారీ వర్షం రైతులను నిండా ముంచింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవగా, కోతకు సిద్ధంగా ఉన్న వరి పైర్లు నేలవాలాయి. ఒక్కసారిగా వచ్చిన వానతో ధాన్యాన్ని కాపాడుకోలేక రైతాంగం చేష్టలూడిగి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. చూస్తుండగానే వర్షం దంచికొట్టడం, వరద ఏరులై ధాన్యం కుప్పలను ముంచెత్తడం, ఆ ఉధృతికి వడ్లు కొట్టుకు పోతుంటే వాటిని ఆపలేక, పంటను కాపాడుకోలేక రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఉప్పొంగుతున్న కన్నీళ్లను దిగమింగుకుంటూ జోరు వానలోనూ వడ్లను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు.

–నాగిరెడ్డిపేట/లింగంపేట్/మోర్తాడ్/పొతంగల్, అక్టోబర్ 21



గోపాల్‌పేట్‌లో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని దోసిళ్లతో ఎత్తుతున్న రైతు

**నాగిరెడ్డిపేట** మండలంలో సోమవారం గంటకు పైగా కురిసిన భారీ వర్షం రైతున్నలను గుండెకోతకు గురి చేసింది. గోపాల్‌పేట, పోచారం, మాల్తుమ్మెద, బంజారా లింగంపల్లి, తాండూర్, వెంకంపల్లి గ్రామాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి, నీట మునిగింది. వర్షపు నీటితో కొట్టుకుపోయిన ధాన్యం కుంటల్లోకి చేరింది. చేతికొచ్చిన పంట కళ్లముందే కొట్టుకుపోతుండడంతో రైతులు అచేతనులై చూస్తుండి పోయారు. అటు లింగంపేట్ మండలంలోనూ జోరువాన కురిసింది. భవానీపేట, ముంబాజీపేట, కొండాపూర్, జల్దిపల్లి, ముస్తాపూర్, ఎల్లారం తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఉన్నట్టుండి వర్షం రావడంతో రైతులు ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోలేక పోయారు. అటు మోర్తాడ్, కమ్మర్‌పల్లి, సిరికొండ, పొతంగల్ తదితర మండలాల్లో కురిసిన వానతో వడ్లు తడిసి పోయాయి. చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి.



ధాన్యం కుప్పల నుంచి వర్షపు నీరు పోవడానికి కాలువలు తీస్తున్న రైతులు

### కొనుగోళ్లు లేక విలవిల..

సుమారు నెల క్రితమే వరి కోతలు ప్రారంభం కాగా, 15 రోజుల నుంచి ఊపందుకున్నాయి. బోధన్, బాన్సువాడ డివిజన్లలో సగానికి పైగా కోతలు పూర్తి కావొచ్చాయి. లింగంపేట్, నాగిరెడ్డిపేట్ తదితర మండలాల్లో ఎక్కడ చూసినా ధాన్యపు రాసులే కనిపిస్తున్నాయి. అయితే, కొనుగోళ్ల ప్రా రంభం కాకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లలో పూర్తిగా విఫలం కావడం, అదే సమయంలో అకాల వర్షాలు వెంటాడుతుండడంతో రైతుల కష్టాలు రెట్టింపయ్యాయి. కొనుగోలు కేంద్రాలను జోరుగా ప్రారంభిస్తున్నా ఎక్కడా కాంటాలు వేసింది లేదు. ఒక్క గింజా కొన్నది లేదు. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే అధికారుల నుంచి సమాధానం కరువైంది. అయితే, మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి ముందుకు రావడం లేదని తెలిసింది. కాంటాలు వేయక పోవడంతో ఎక్కడికక్కడ వడ్ల కుప్పలు పేరుకుపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ధాన్యం కుప్పలు నీట మునిగాయి. వడ్లు తడిసి రంగు మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కాంటాలు వేస్తే తమకీ కష్టాలు ఉండకపోయేవన్నారు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వడ్లు అమ్ముకున్నామని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం వెంటనే వడ్ల కాంటాలు ప్రారంభించాలని, రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



సదాశివనగర్‌లో వర్షానికి నేలకొరిగిన వరి పంట



నస్రుల్లాబాద్‌లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

## 'భరోసా' ఎగవేతపై వెల్లువెత్తిన నిరసనలు

ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ ఆందోళనలు

నస్రుల్లాబాద్/ చందూర్ (మోస్రా)/బిచ్కుంద, అక్టోబర్ 21: రాష్ట్ర ప్రభుత్వం వానకాలానికి సంబంధించి రైతు భరోసా ఎగ్గొట్టడంపై బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రైతుభరోసాపై వేసిన కమిటీ రిపోర్టు వచ్చాక వచ్చే సీజన్ నుంచి భరోసా అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశాయి. సోమవారం నస్రుల్లాబాద్, చందూర్, జుక్కల్ తదితర మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, బీఆర్‌ఎస్ జుక్కల్ మాజీ మండల అధ్యక్షుడు నీలూ పటేల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ మోస పూరిత వాగ్దానాలతో రైతులు పూర్తిగా నష్టపోయారని అన్నారు. ఈ సీజన్‌లో రైతుభరోసాను ఎగ్గొట్టి రైతులను మోసం చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని, రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నస్రుల్లాబాద్‌లో చేపట్టిన కార్యక్రమంలో నాయకులు మోచే గణేశ్ గౌడ్, నర్సింహులు గౌడ్, టేకుర్ల సా యిలు, రమేశ్ యాదవ్, మొసిన్, శేఖర్, భా స్కర్, నారాయణ, గంగారాం, అల్లం సా యిలు, చందూర్‌లో సొసైటీ మాజీ చైర్మన్ మద్దూరి మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కోటగిరి రాములు, మాముళ్ల శ్రీనివాస్, పోశెట్టి, మోస్రా నాయకులు పసుల ప్రశాంత్ రెడ్డి, కోత్ మీర్ కార్ విజయ్, గంధం విజయ్, షేక్ అలీమ్, గొల్ల ప్రశాంత్, కే రాజు, మోచి గణేశ్, మహ్మద్ కరీం, మగ్బుల్, జుక్కల్ మాజీ ఉప సర్పంచ్ భానుగౌడ్, బొల్లి గంగాధర్, వాసర్ వార్ రమేశ్, పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.



జుక్కల్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## న్యాయాధికారుల కోసం వసతి గృహాలు

- నిజామాబాద్, బోధన్ కోర్టు ప్రాంగణాల్లో నిర్మాణం
- వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేసిన హైకోర్టు న్యాయమూర్తులు



నిజామాబాద్ కోర్టు ప్రాంగణంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, అక్టోబర్ 21: నిజామాబాద్, బోధన్ కోర్టుల ప్రాంగణాల్లో న్యాయస్థానాల్లో విధులు నిర్వర్తిస్తున్న న్యాయాధికారుల కోసం వసతి గృహాలను నిర్మించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు కాసోజు సురేందర్, లక్ష్మీనారాయణ అలిశెట్టి, వినోద్ కుమార్ సోమవారం వర్చువల్ ద్వారా నిర్మా ణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయస్థానా ల్లో విధులు నిర్వహిస్తున్న న్యాయాధికారులకు మౌలిక వసతుల కల్పన ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ కాసోజు సురేందర్ మాట్లాడుతూ.. నిజామాబాద్, బోధన్ కోర్టుల ప్రాంగణాల్లో న్యాయాధికారులు అందుబాటులో ఉండే విధంగా గృహ సముదాయాల శంకుస్థాపనకు శ్రీకారం చుట్టడం మౌలిక వసతుల కల్పనలో ఒకమెట్టుగా అభివర్ణించారు. నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో లిఫ్ట్ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి మాట్లాడుతూ.. కోర్టు సముదాయాల్లోనే న్యాయాధికారులకు క్వార్టర్స్ ఉండడంతో త్వరతగతిన వారు కోర్టు విధులకు చేరుకోగలరని అన్నారు. కోర్టు సముదాయాల్లో న్యాయాధికారులకు గృహ వసతి కల్పించడంవల్ల భద్రతాపరమైన సమస్యలు ఉండవని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ.. జిల్లాలో విధులు నిర్వహిసున్న న్యాయాధికారులకు సౌలభ్యకరంగా ఉండేలా నూతన భవన నిర్మాణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు కనక దుర్గ, శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బూ, గోపీకృష్ణ, చైతన్యతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్, అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ అమరవీరులకు నివాళులు అర్పించారు.

–కామారెడ్డి, అక్టోబర్ 21

## పరిశోధన, బోధనా రంగాలపై ప్రత్యేక దృష్టి

- టీయూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ఏర్పాటుకు కృషి
- త్వరలో న్యాక్ గుర్తింపునకు వెళతాం..
- వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ యాదగిరి రావు



టీయూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ యాదగిరి రావు

డిచ్‌పల్లి, అక్టోబర్ 21: తెలంగాణ యూనివర్సిటీని ప్రధానంగా పరిశోధన, బోధన రంగాల్లో బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామని నూతన వీసీ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు పేర్కొన్నారు. టీయూ పరిపాలనా భవనంలో సోమవారం ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని డిగ్రీ, పీజీ కళాశాలలను టీయూ పరిధిలోకి తీసుకువచ్చే ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. వర్సిటీ విద్యార్థుల కోసం సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ప్రవేశపెడతామన్నారు. వర్సిటీకి న్యాక్ గుర్తింపు కోసం ప్రయత్నిస్తామని, ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో వర్సిటీలో ప్రభుత్వ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.వీలైనంత త్వరలో వర్సిటీ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. బాలికల వసతి గృహ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.వర్సిటీ భూముల అన్యాక్రాంతంపై కలెక్టర్‌ను సంప్రదిస్తామన్నారు.

**నూతన వీసీకి శుభాకాంక్షల వెల్లువ**

టీయూ నూతన వీసీగా బాధ్యతలు స్వీకరించిన యాదగిరి రావుకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, అన్ని విభాగాల బోధన, బోధనేతర సిబ్బంది ఘన స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. టీయూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యాపకులతో వీసీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పరిపాలనా భవనంలోని వివిధ విభాగాలను వీసీ సందర్శించారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## కల్యాణలక్ష్మి మంజూరులో జాప్యం వద్దు

### చెక్కుల పంపిణీలో మంత్రి జూపల్లి కృష్ణారావు

కంఠేశ్వర్, అక్టోబర్ 21: జాప్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంజూరు చేయాలని అధికారులకు..జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సోమవారం 513 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఎలాంటి కాలయాపన జరగకుండా లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న నెల రోజుల్లోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, మున్సిపల్ కమిషనర్ మకరంద్ రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

## ఆస్తి కోసం దారుణం

- పెండ్లి చేయడం లేదని ఆక్రోశం
- తండ్రిని చంపిన తనయుడు
- సాధారణ మరణంగా చిత్రీకరణ
- అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా బయటపడిన బాగోతం



అమృతం (ఫైల్)

నవీపేట, అక్టోబర్ 21: ఆస్తి ఇవ్వకుండా, పెండ్లి కాకుండా అడ్డు పడుతున్న తండ్రిని హతమార్చాడో తనయుడు. సాధారణ మరణం కింద చిత్రీకరించబోయిన అతడి బాగోతం బట్టబయలైంది. నవీపేట ఎస్సై వినయ్ కథనం ప్రకారం.. మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గౌరు అమృతం (55)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమృతం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తూ, వచ్చిన వేతనంతో తప్పతాగుతూ ఉండేవాడు. అతడి వ్యవహార శైలి నచ్చక 20 ఏండ్ల క్రితమే భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని మాక్లూర్ మండలం గొట్టుముక్కలలో ఉండే పుట్టింటికి వెళ్లి పోయింది. బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లిన పెద్ద కుమారుడు మహిపాల్ అనంతగిరిలో ఉన్న ఇంటిని అమ్మేసి గొట్టిముక్కలలో ఇల్లు కట్టుకోవాలని అనుకున్నాడు. కానీ తండ్రి ఒప్పుకోలేదు. మరోవైపు, మహిపాల్‌కు చెందిన బర్లను చెప్పకుండా అమృతం అమ్మేసుకున్నాడు. కుమారుడు పెండ్లి చేసుకుంటానంటే ఏదో సాకు చెప్పి అడ్డు పడుతున్నాడు. ఆస్తి ఇవ్వకుండా, పెండ్లి కాకుండా అడ్డు పడుతున్న తండ్రిని చంపాలని మహిపాల్ నిర్ణయించుకున్నాడు. తన తండ్రి మృతి చెందాడని దుబాయ్‌లో పని చేస్తున్న కంపెనీకి తప్పుడు సమాచారం ఇచ్చి పది రోజుల క్రితం అనంతగిరికి చేరుకున్నాడు. తండ్రిని చంపడానికి సమయం కోసం వేచి చూస్తున్న మహిపాల్ ఆదివారం రాత్రి అమృతంతో కలిసి మద్యం తాగాడు. తాగిన మైకంలో ఉన్న తండ్రిని టవల్‌తో గొంతుకు బిగించి హత్య చేశాడు. అనంతరం స్థానికంగా ఉండే ఓ ఆర్‌ఎంపీని మచ్చిక చేసుకుని సాధారణ మరణం కింద చిత్రీకరించాడు. మరణ వార్తను స్థానికులు, బంధువులకు అందించాడు. సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలకు తరలించే క్రమంలో మృతదేహానికి స్నానం చేయిస్తుండగా శరీరంపై గాయాలు కన్పించాయి. దీంతో అనుమానం వచ్చిన బంధువులు, స్థానికులకు పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ క్రమంలో పోలీసులు మహిపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. హతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.